www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 27 డిసెంబర్ 2024



మ్యాంగో పరిశ్రమలను ఆదుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యుద్ధ ప్రభావంతో ఎగుమతులు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మ్యాంగో పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు జిల్లాకు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు గురువారం విన్నతి చేశారు. మ్యాంగో పరిశ్రమల్లో నిల్వ ఉన్న జ్యూస్‌ను ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పుణ్యక్షేత్రాల్లో భక్తులకు ఇవ్వడం ద్వారా పరిశ్రమల కష్టాలు కొంత మేరకు తీరే అవకాశముందన్నారు. అలాగే మామిడి రైతులకు గిట్టుబాటు కల్పించాలని కోరారు. పండ్ల గుజ్జు పరిశ్రమల్లో నిల్వలు పేరుకుపోవడంతో రానున్న మామిడి సీజన్‌లో మామిడి కొనుకోలు చేసే పరిస్థితి ఉండబోదనే పరిశ్రమల యజమానుల హెచ్చరికలతో మామిడి రైతులను బెదిరించే పరిస్థితి ఏర్పడుతుందని మామిడి రైతులు, పరిశ్రమల యజమానులను దృష్టిలో ఉంచుకొని మామిడి రైతులను ఆదుకొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు చీకట్లో.. మృత్యు కాట్లు..

- జాతీయ రహదారిపై వెంటాడుతున్న భయం
- చీకట్లోనే అత్యధిక ప్రమాదాలు

పూతలపట్టు మండల పరిధిలోని జాతీయ రహదారులపై వాహన చోదకులను చీకటి భయం వెంటాడుతోంది. రాత్రి సమయాల్లోనే రహదారుల్లో ప్రమాదాలు అత్యధికంగా జరగడం... వాహన చోదకులను కలవరపెడుతోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉన్న రహదారిపై కటిక చీకటి ఏర్పడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన రెండు ప్రమాదాలు ఉదాహరణకు...

పూతలపట్టు మండల పరిధిలోని రంగంపేట ఎస్టి కాలనీకి చెందిన సిద్ధయ్య కుమార్తె వాణిశ్రీ (14) రోడ్డు పక్కనే ఉన్న ఒక ప్రైవేటు హోటల్లో పనిచేస్తుంది. వారం రోజుల క్రితం రాత్రి 10 గంటల 45 నిమిషాల ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. చీకటి కావడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోతున్నారు.



జీడి నెల్లూరు మండలం ఎల్లంరాజుపల్లె గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి (20) ఐదు రోజుల క్రితం నాయుడుపేట -పూతలపట్టు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం రాత్రి పది గంటల సమయంలో చోటుచేసుకుంది. జాతీయ రహదారి కారు చీకటితో కమ్ముకోవడంతో రహదారి పక్కన వెళుతున్న వాహన చోదకులను గుర్తించలేక అధిక ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది.



రంగంపేట క్రాస్‌లో రాత్రి సమయంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వాణిశ్రీ



పిచ్చన్నగారిపల్లి వద్ద రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల పరిధిలో రెండు జాతీయ రహదారుల్లో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. బెంగళూరు -నాయుడుపేట ఆరు వరసల జాతీయ రహదారిపై చాలావరకు దీపాల కాంతి లేకపోవడంతో అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా మండల పరిధిలోని కిచ్చన్నగారిపల్లి నుంచి వేము ఇంజనీరింగ్ కళాశాల మధ్య అధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇందులో 80 శాతం రాత్రి సమయంలో మాత్రమే సంభవిస్తున్నాయి. ఒక్క వంటిల్లు వద్ద మినహాయిస్తే ఏడు కిలోమీటర్ల పొడవునా వెలుతురు కనిపించదు. దీంతో ఈ మార్గంలో ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయని పోలీసులు అంటున్నారు. అదేవిధంగా గ్రామాలు ఉన్నచోట ప్రజలు రోడ్డు దాటుతూ చీకట్లో ప్రమాదాల భారిన పడుతున్నారని కనీసం ఎక్కడైనా లైట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూతలపట్టులో దారుణమైన పరిస్థితి

252 గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం నిత్యం పూతలపట్టు మండల కేంద్రానికి వచ్చి వెళుతుంటారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో జనసంచారం అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో మండల కేంద్రానికి అనుసంధానం అయిన పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో దీపాలు ఉన్నా ఒక్కటీ వెలగడం లేదు. దీంతో అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రతినిత్యం చీకటి పడితే ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. మంగళవారం వారపు సంత రోజు అయితే మరింత అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీపాల మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు అనేకమార్లు గ్రామ ప్రజలు విన్నవించిన పట్టించుకోవడం లేదు.. ప్రమాదాలు తగ్గడం లేదు.. ఇకనైనా అధికారులు స్పందించి వీధిదీపాలు మరమ్మతులు చేపట్టాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎన్‌సిడి - సిడి సర్వేను ఏంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ఇంటింటకీ వెళ్లి నిర్వహించాలని ఈ దిశగా మెడికల్ ఆఫీసర్లు పనిచేయాలన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వైద్యఆరోగ్య శాఖ అధికారులతో ఎన్‌సిడి సర్వేపై మెడికల్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సిడి సర్వేలో భాగంగా చేస్తున్న ఆరోగ్య పరీక్షల్లో జిల్లాలోని ప్రతి ఒక్కరినీ వారి ఇంటి వద్దకు వెళ్ళి పరీక్షలు జరిపి ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సర్వేలో ప్రధానంగా రక్తపోటు (బిపి)ను పరీక్షించుట, బ్లడ్ గ్లూకోస్ (మధుమేహం)ను పరీక్షించుట, హిమోగ్లోబిన్‌ను పరీక్షించుట, బిఎంఐను చూడడం జరుగుతుందని దీనితోపాటు మహిళలలో కేన్సర్‌కు సంబంధించి ఎటువంటి లక్షణాలు ఉన్న అటువంటి అనుమానిత కేసులను గైనకాలజిస్ట్‌తో పరీక్షించి స్క్రీనింగ్ నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపాలన్నారు. ఈ ప్రక్రియలో ఏంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు కేన్సర్‌కి సంబంధించి ఉన్న ప్రశ్నావళిని పూరించడంలో సరైన అవగాహన కలిగి ఉండేలా మెడికల్ ఆఫీసర్లు కృషి చేయాలని వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న ఇమ్యూనిజేషన్‌లో భాగంగా పిల్లలకు ఓపివి, డిటిపి, హెపటైటిస్ బి, ఇతర వ్యాక్సినేషన్లకు సంబంధించి జిల్లాలో పుట్టిన పిల్లలకు, వారికి చేసిన వ్యాక్సినేషన్‌కి తేడా కలదని, మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలో ఉన్న పబ్లిక్, ప్రైవేటు హాస్పిటల్‌లో పుట్టిన పిల్లల పూర్తి వివరాలను, వాక్సినేషన్ చేసిన వారి వివరాలను పూర్తి పారదర్శకంగా సిద్ధం చేసి వారం లోపల సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను సంబంధించి పూర్తి సమాచారం ను ప్రతి మెడికల్ ఆఫీసర్ వారి వద్ద అందుబాటులో ఉంచుకోవాలని వాక్సినేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఎక్సైజ్ శాఖ కార్యదర్శి



ముఖేష్ కుమార్ మీనాకు స్వామివారి తీర్థప్రసాదాలు అందిస్తున్న కలెక్టర్, ఈవో

ప్రజాశక్తి-ఐరాల: వరసిద్ధి శ్రీ వినాయక స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖేష్ కుమార్ మీనాను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కార్యక్రమంలో చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, ఎక్సైజ్ శాఖ ఈఎస్‌లు శ్రీనివాస్, నాగమల్లేశ్వర్, డిఎస్‌పి వాసుదేవ చౌదరి, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, ఐరాల ఎమ్మార్వో, మహేష్, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

రోగుల సమాచారం పక్కా..

- **డిజిటల్ యాప్‌లో సమాచారం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే వైద్యసేవలు పక్కాగా ఉండేలా ఎన్‌టిఆర్ వైద్యసేవా యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ మేరకు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం నుండీ ఆదేశాలు అందాయి. రోగులకు అందించే వైద్యసేవలు ఎన్‌టిఆర్ వైద్యసేవ యాప్‌లో నమోదు చేయడం ద్వారా ఆసుపత్రులకు వస్తున్న రోగులు, వారి వివరాలతో పాటు ఏఏ ఆసుపత్రిలో ఏ విధమైన రోగులు వైద్యసేవల కోసం వస్తున్నారు. శస్త్రచికిత్సలను బట్టి ఆసుపత్రుల అభివృద్ధి, మౌళిక వసతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. గతంలో రోగుల వివరాల మాత్రమే నమోదు చేసేవారు. కూటమి ప్రభుత్వం రోగుల వివరాలతో పాటు వైద్యసేవలను నమోదు చేయాలని ఆదేశాల్చింది. ఈ మేరకు రోగుల వివరాలతో వైద్యసేవలను నమోదు చేస్తున్నారు.



డాక్టర్ సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు వైద్యపరీక్షలు, ప్రభుత్వ వైద్యులు అందించిన వైద్యసేవలు వ్యాధి తగ్గుముఖం పట్టిన తరువాత పట్టించుకోవడం లేదు. అదే రోగి తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే గతంలో ఏ వ్యాధి సోకి ఆసుపత్రికి వచ్చాడు, వ్యాధి నయం కావడానికి చేసిన వైద్యం వంటి వివరాలు అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ వైద్యులను ఇబ్బందిగా మారుతోంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి వివరాలు పొందుపరచబడి ఉంటాయి. తిరిగీ ఆ ఆసుపత్రికి వెళ్ళితే గతంలో అందించిన వైద్యసేవల వివరాలు వస్తాయి. అలాంటి సమాచారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్‌లో రోగుల సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.

ఆయుష్మన్ భారత్ డిజిటల్‌లో రోగుల వివరాలు

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ యాప్‌లో వివరాలు నమోదు చేయనున్నారు. జిల్లా ఏరియా, సీహెచ్‌సీల్లో ఇది పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే రోగుల ఆధార్ కార్డు నకలు, సెల్ నెంబర్ తీసుకోవాలి. ఓపి చీటిలో రోగి పేరు, వయస్సు రాసిన వెంటనే వీటి వివరాలు ఏ ఏడాది చికిత్స తీసుకుంటున్నారా అనే అంశాలతో పాటు తొమ్మిది అంకేల నెంబర్ కేటాయిస్తారు. వైద్యుడు రోగికి అందించిన వైద్య, వాడిన మందులు, పరీక్షలు రోగ నిర్ధారణ వంటి అంశాలు యాప్‌లో నమోదు చేస్తారు. ఇదంతా ఆన్‌లైన్ చేయడంతో రోగి ఆధార్ నంబరు కొడితే చాలు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రోగి వివరాలు తెలుస్తాయి. దీన్ని చూపించి ఎక్కడైనా వైద్యం చేయించుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల రోగికి సంబందించిన సమగ్ర సమాచారం వైద్యుడికి యాప్ ద్వారా తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ డిసెంబర్ మొదటి వారం నుండీ జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో అమలు చేస్తున్నారు. ఇందు కోసం కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలను సమకూరుస్తున్నారు.

రోగుల సమాచారం పక్కాగా ఉంటుంది..

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సమాచారం పక్కాగా ఉండేలా ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. చిత్తూరు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 50, 24 గంటలు పని చేసే ఆరోగ్య కేంద్రాలు 20, నాన్ 24 ఆరోగ్య కేంద్రాలు 30, సబ్ సెంటర్లు 613, సామాజిక ఆరోగ్య కేంద్రాలు 7, ప్రాంతీయ వైద్యశాలలు 3, జిల్లా ఆసుపత్రి 1, నవజాత శిశుకేంద్రం 1, పట్టణ ఆరోగ్య కేంద్రాలు 14, జిల్లా రక్తనిధి కేంద్రాలు రెండు ఉన్నాయి. ప్రస్తుతానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో అమలు చేస్తోంది. రోగుల సమాచారం యాప్‌లో నమోదు చేయడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే వైద్యం, శస్త్రచికిత్సల వివరాలు ఎన్‌టిఆర్ వైద్యసేవలో నమోదు చేయాలి. దీని ప్రకారం ఆసుపత్రులకు నిధులను కేటాయిస్తారు. దీని వల్ల ఆసుపత్రుల్లో వసతులు మరింత మెరుగవుతాయి.

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ప్రజల సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసులను ఏపిఎస్ ఆర్‌టిసి అందుబాటులోనికి తీసుకొని రావడం జరిగింది. గురువారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపిఎస్ ఆర్‌టిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నంలు నూతన బస్సు సర్వీసులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానాన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు ఆర్టీసీ ప్రక్షాళనతోనే కుప్పం అభివృద్ధి ప్రారంభిస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందేనని అన్నారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే కుప్పం డిపో నుంచి పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రం ఉన్న తిరుపతి నగరానికి, రాష్ట్ర రాజధాని అమరావతికి సమీపంలోని విజయవాడకు నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజల సౌకర్యార్థం తిరుపతికి 3 బస్సు సర్వీసులను, విజయవాడకు రెండు బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, ఎన్డీఏ కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు వార్షిక తనిఖీ నిర్వహించి, రికార్డులను సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌కు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అల్లర్లు, గొడవలకు తావుండరాదని అధికారులకు సూచించారు. పోలీస్ మూమెంట్స్ బాగా పెంచాలని అలాగే విజిబుల్ పోలీసింగ్ ప్రతిరోజూ నిర్వహించడంపై స్పష్టమైన దృష్టి పెట్టాలని, ఇది ప్రజలలో భద్రతావగాహన పెరిగేందుకు సహాయపడుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో పోలీసు రాకపోకలు ఉంటే, దుష్టచర్యలు తగ్గిపోతాయని, రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు కఠినంగా పాటించాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, మట్కా, పేకాట వంటి వ్యాపారాలపై గట్టి చర్యలు తీసుకోవాలని, ఈ విధమైన కార్యకలాపాలు మన సమాజంలో దోపిడి, హింస పెంచేవే కాక, శాంతిని భంగం చేస్తాయని, గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా ఉంచి, అవి ప్రజల ఆరోగ్యంపై పడే ప్రభావాలను అరికట్టాలని పేర్కొన్నారు. ఈ వ్యాపారాలను నియంత్రించడమే కాకుండా, మత్తు పదార్థాలపై ప్రజల అవగాహన పెంచడం కూడా అవసరమని మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేస్తూనే ఇదివరకే జరిగిన నేరాలలో రికవరీలు పెంచాలన్నారు. యుఐ కేసులు, అనుమానాస్పద మృతుల కేసులకు జాప్యం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్‌ను పెంచాలని సూచించారు. తనిఖీల్లో చిత్తూరు సబ్ డివిజన్ బీఎస్పీ టి.సాయినాథ్, డిసిఆర్‌బి ఎస్ఐ ఉమామహేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్తూరు డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

బొమ్మసముద్రం సర్పంచ్‌కు అభినందనలు



బొమ్మసముద్రం సర్పంచ్ రఘును అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ద్వారా జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఆరోగ్య పంచాయతీగా నిలిచిన బొమ్మ సముద్రం సర్పంచ్ రఘును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో బొమ్మసముద్రం సర్పంచ్ ఆరోగ్య పంచాయతీ పురస్కారంతో డిపిఓ సుధాకర్ రావుతో కలసి జిల్లా కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీని ప్రగతి పథంలో నడిపించడంతో పాటు మరింత పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహణ చేసే విషయంలో పంచాయతీ అధికారులు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు డిఎల్‌పిఓ పార్వతి, అధికారులు పాల్గొన్నారు.

వెలిగిన విద్యుత్ దీపాలు


ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలో గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ విద్యుత్ దీపాలను స్విచ్ ఆన్ చేసి వెలిగించారు. పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించిన విద్యుత్ దీపాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం పురపాలక సంఘాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు తగ్గట్టు పురపాలక సంఘం కౌన్సిలర్లు, కమిషనర్ పనిచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పట్టణాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలో ప్రభుత్వ అనుమతితో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు టిడిపి జాతీయ అధ్యక్షులు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి బాబు కట్టుబడి ఉన్నారని, ఆయన ఆలోచనలను కార్యరూపం దాల్చడానికి తెలుగు తమ్ముళ్లు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. కౌన్సిలర్లు సోము, సురేష్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్‌కుమార్, పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి ఆర్ముగం, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, సత్యేంద్ర శేఖర్, వేణు, భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్, శివశంకర్ పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలను వెలిగించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా కోర్టు పరిధిలోని చిత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఎన్నికల అధికారిగా నియమితులైన సీనియర్ న్యాయవాది జి.వసంత కుమార్ గురువారం నామినేషన్లను స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి మొత్తం 28 మంది పోటీపడుతున్నారు. అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడుతుండడంతో పోటీ హోరాహోరీగా సాగనుంది. కార్యదర్శి పదవికి ముగ్గురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడుతున్నారు. కోశాధికారి, సాంస్కృతిక కార్యదర్శి పదవికి ముగ్గురు చొప్పున, లైబ్రరీ కార్యదర్శి పదవికి ఇద్దరు పోటీపడుతున్నారు. సీనియర్, జూనియర్ ఈసీ మెంబర్ పదవులకు నలుగురు చొప్పున బరిలో ఉన్నారు. జాయింట్ సెక్రెటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ పదవులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియను బార్ అసోసియేషన్ కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, రఘురాం పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల స్క్రూటిని, శనివారం ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు.



అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్న దృశ్యం

వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు: డిఎం

ప్రజాశక్తి- పుంగనూరు: ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం మండలం నుండి ప్రజల సౌకర్యార్థం శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. జనవరి 4, 5, 11 తేదీలలో ఉదయం 6 గంటలకు బయలుదేరుతాయన్నారు. అత్తిరాల, నందలూరు, ఒంటిమిట్ట, కడప, దేవుని కడప, పుష్పగిరి, రాయచోటిలలో ఆలయాలు సందర్శించుకుని అదే రోజు రాత్రి పుంగనూరుకు చేరుతాయన్నారు. టికెట్ ధర పెద్దలకు 750 పిల్లలకు 450 ఉంటుందని టికెట్లు ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు అని చెప్పారు. అలాగే పుంగనూరు డిపో నుండిపై తెలిపిన తేదీలలో నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, తిరుచానూరు, అప్పలాయగుంట తిరుపతి శ్రీనివాస మంగాపురం ఆలయాలను దర్శించుకుని తిరిగి అదే రోజు పుంగునూరుకు చేరుతాయన్నారు. వీరికి టికెట్ ధర పెద్దలకు 550 పిల్లలకు 350 రూపాయలు ఉంటుందన్నారు. కావున శైవ క్షేత్రాలు దర్శించుకోవాలనుకునే భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంటా కమలమ్మ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: గంటా కమలమ్మ సాహితీ పురస్కారం – 2024 కు 'నాలుగు రెక్కల పిట్ట' (సాంబమూర్తి లండ , శ్రీకాకుళం), 'చింతల తొవ్వ' (తుల శ్రీనివాసులు, నల్గొండ) కవితా సంపుటాలు సంయుక్తంగా ఎంపికయ్యాయని, పురస్కార వ్యవస్థాపకులు, అరసం జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ తెలిపారు. పురస్కారం కోసం నిర్వహించిన పోటీకి, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 35 కవితా సంపుటాలు అందాయని, న్యాయనిర్ణేతలుగా సాహితీవేత్తలు రాధేయ (అనంతపురం), రఘు (హైదరాబాద్) వ్యవహరించారని తెలిపారు. ఈ పోటీకి అద్భుతమైన కవితా సంపుటాలు పంపిన కవులందరికీ ధన్యవాదాలు తెలిపారు. 2025 జనవరిలో నిర్వహించబోయే సాహితీ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు సంయుక్తంగా రూ.10,000లు నగదు, పురస్కార ప్రధానం జరుగుతుందని తెలిపారు.

జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి- గంగవరం : యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు తులసీనాద నాయుడు తెలియజేశారు. జనవరి 15వ తేదీ లోపు ఆసక్తి గల వారు నూరు పద్యాలకు పైగా వేమన పద్యాలు చెప్పేవారు ఈ కార్యక్రమానికి అర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు 95334 29770 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కానీ నేరుగా కానీ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

5,6 తేదీల్లో బాబు కుప్పం పర్యటన

ప్రజాశక్తి- కుప్పంటౌన్: జనవరి నెల మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నట్లు స్థానిక టిడిపి వర్గాలు తెలిపారు. జనవరి 5, 6 తేదీలలో బాబు పర్యటన ఉంటుందని చెబుతున్నారు. అయితే ఇప్పటికి అధికారిక ప్రకటన వెలువడ లేదని సమాచారం. బాబు పర్యటన ఖరారు అయితే స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు బాబు శంకుస్థాపన చేయనున్నారని, రాష్ట్రంలోనే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దనన్న బాబు ప్రకటన కార్యరూపం దాల్చుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

28న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- పుంగనూరు : ఎవరికైనా కంటిచూపు, కంటిలో పోర, చూపు తగ్గిన వారికి ఉచితంగా కంటి చికిత్స వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.మునస్వామి మొదలియార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాటిమోకులపాలెం రోడ్డు శిబిరంను రిటైర్డ్ ఉద్యోగస్తులు విశ్రాంతి భవనంలో శనివారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ఎంపిక చేయబడిన వారికి చెన్నై శంకర్ నేత్రాలయలో కంటి ఆసుపత్రిలో వైద్యంతో పాటు ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. కావున ఈ అవకాశాన్ని కంటి సమస్యలున్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు రెడ్డప్ప మృతిపై ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం చిత్తూరు రూరల్ మండలం కోట్రకోన గ్రామంలోని గృహానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ నుండి మట్టి ఖర్చులు రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం, నగరపాలక ఉద్యోగులు మృతుడికి నివాళులు అర్పించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంహెచ్ఓ లోకేష్

పులిచెర్లలో చల్లా బాబు పర్యటన

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం బోడిరెడ్డి గారిపల్లిలో గురువారం పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పర్యటించారు. బోడిరెడ్డిగారిపల్లి గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న చల్లా బాబు

వైకుంఠ ఏకాదశికి భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమలలో త్వరలో జరగనున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు పోలీసు శాఖ విస్తత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు స్వయంగా భక్తుల భద్రతను గురువారం పరిశీలించారు. క్యూలైన్ ఏర్పాట్లు, పార్కింగ్ అంశాలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల అడిషనల్ ఎస్పీ రామకష్ణ, డిఎస్‌పి విజయ శేఖర్, సిఐలు విజయ్ కుమార్, శ్రీరాముడు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- వి కోట: జిల్లాలో నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం వీకోట పోలీస్ స్టేషన్ పరిశీలించిన జిల్లా ఎస్పీకి పలమనేరు డిఎస్‌పి ప్రభాకర్ నేతృత్వంలో సీఐ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. అనంతరం అమార్ట్స్ అధినేత దశరథ రెడ్డి సహకారంతో 10 లక్షల రూపాయల వ్యయంతో పట్టణంలో అధునాతన టెక్నాలజీతో అమర్చిన సీసీ కెమెరా, కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. పట్టణంలో అడుగడుగునా పోలీసు నిఘు ఉంటుందని వాహనాల ఆక్సిడెంట్లతో పాటు ఇతర దొంగతనాలు తదితర అంశాలపై కొత్త వ్యక్తుల సంచారంపై నిరంతర నిఘంటుందని ఎస్పీ వివరించారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

అనంతరం స్టేషన్లలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలమనేరు డిఎస్పి ప్రభాకర్, వీకోట అర్బన్ సిఐ సోమశేఖర్ రెడ్డి, ఎస్సైలు బాబు, పరశు రాం, ఏఎస్ఐ మురళి, జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూం ప్రారంభం



ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూంను ప్రారంభించిన రామచంద్ర నాయుడు

ప్రజాశక్తి- వీ కోట: మండల కేంద్రమైన వీ కోటలో నూతనంగా ఏడిఎంఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షో రూమ్‌ను మాజీ ఏఎంసి చైర్మన్ రామచంద్ర నాయుడు ప్రారంభించారు. గురువారం ఉదయం మండల టిడిపి అధ్యక్షులు రంగనాథ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి షో రూమ్‌ను ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఎలక్ట్రిక్ వాహనాలు వీకోట ప్రజలకు అందుబాటులో ఉన్నాయని మేనేజింగ్ పార్ట్నర్స్ విశ్వనాథ్, సుబ్రమణి, సుబ్రహ్మణ్యం శెట్టిలు తెలిపారు. టిడిపి నాయకులు చౌడప్ప, గోపీనాథ్, సుబ్బన్న, మధు, రత్నప్ప, మోహన్రావు, చంద్రారెడ్డి, సోమశేఖర్, హరినాథ్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్, నాగరాజు, జయ చంద్ర, కోదండ రెడ్డి, నాసిర్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- చౌడేపల్లి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ మాధవి అన్నారు. గురువారం మండలంలోని పంచాయతీ కేంద్రం లదిగంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తొమ్మిది మంది రైతులు మాత్రమే తమ భూ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, మండల సర్వే గుణశేఖర్, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని గానుగచింత నగిరి హైస్కూల్‌లో గురువారం రెవెన్యూ సదస్సు తహశీల్దారు పి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఆర్ఎస్ డిటి లోకేష్, ఆర్ఐ సుధాకర్ నాయక్, రెవెన్యూ అధికారులు, నాయకులు కృష్ణమ నాయుడు, మధు నాయుడు, శేషాద్రి నాయుడు, అమర్నాథరెడ్డి, ముద్దు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: భూ సమస్యలు లేని గ్రామాలుగా తయారు



చేయాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని రాగిమానుపెంట గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సబ్ రిజిస్ట్రార్ యుగంధర్, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, ఎండోమెంట్ సిబ్బంది శరవన్ లోకనాథం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం మత్తులో ఆటోడ్రైవర్ వీరంగం

సైకిల్ షాప్ దుకాణంలోకి దూసుకెళ్లిన ఆటో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా వున్న సైకిల్ షాప్ దుకాణంలోనికి ఓ ప్యాసింజర్ ఆటోదూసుకెళ్లింది. పక్కనే వస్తున్న వాహనాలను సైతం ఢీకొడుతూ వెళ్లడంతో బైక్ వస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ గౌస్ అతిగా మద్యం తాగి ప్యాసింజర్ ఆటో నడుపుతూ రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్నారు. అలాగే కుప్పం– పలమనేరు జాతీయ రహదారిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న సైకిల్ షాప్‌లోకి ఆటో దూసుకెళ్లింది. ఆ సమయంలో షాపులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పరుశురాముడు ఆటోడ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



దుకాణంలోకి దూసుకెళ్లిన ఆటో

ఇటుకల బట్టీలో ట్రాక్టర్‌కు మళ్ళీ నిప్పు

రూ. లక్ష ఆస్తి నష్టం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

శేష గౌడు అనే ఇటుకల బట్టీ యజమానికి చెందిన ఇటుకల బట్టీలో ఉన్న ట్రాక్టర్‌కు మళ్లీ ఎవరో గుర్తు తెలీని దుండగులు నిప్పు పెట్టారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి మండలంలోని పెద్దచెరువు సమీపంలోని శేషగౌడుకు చెందిన



ఇట్టుకల బట్టీలో ఉంచిన ట్రాక్టర్‌కు గుర్తు తెలీని దుండగలు నిప్పు పెట్టారు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పూర్తిగా కాలిపోయింది తెలిపారు. గతంలోనూ ఇలానే ట్రాక్టర్‌కు నిప్పు పెట్టారని, మళ్లీ ఇప్పుడు ఇలా నిప్పు పెట్టారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనకు లక్ష రూపాయలు నష్టం కలిగించిన దుండగలను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని ఇట్టుకల బట్టీ యజమాని కోరుతున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కే...

28, 29 తేదీల్లో 'బాలోత్సవం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కే బాలోత్సవమని వ్యవస్థాపక నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు. నేటితరం విద్యార్థుల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేయడానికి, వారికి దూరమవుతున్న కళలు, సాంస్కతిక కార్యక్రమాలు, ఆటపాటలను దగ్గర చేయడానికి పిల్లల పండుగ పేరుతో తిరుపతి బాలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలోత్సవానికి ఆదరణ పెరిగి ఏటేటా పాల్గొనే విద్యార్థుల సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. సాంస్కతిక, హస్త కళలు, క్రీడలు, అకడమిక్ విభాగాలలో 30 అంశాలపై 70 విభాగాలుగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 2022లో ఈ తిరుపతి బాలోత్సవం పిల్లల పండుగ ప్రారంభించామని, మొదట 3500 మంది, 2023లో 5700 మంది, ఈ ఏడాది 2024 లో నిర్వహించే బాలోత్సవ కార్యక్రమానికి 8000 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి బాలోత్సవం పిల్లల పండుగ గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, కోశాధికారి పంచ ముఖేశ్వరరావు, బాలోత్సవం కార్యనిర్వాహకులు వెంకటరమణ, నెల్లూరు మునిలక్ష్మి, తహసున్నిసా బేగం, బాలాజీ చౌదరి, రెడ్డప్ప, కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లని నిరీక్షణ

టిడిపి, జనసేన శ్రేణుల్లో నిరుత్సాహం

ప్రధాన నాయకత్వంలో పెదవివిరుపు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : కూటమి ప్రభుత్వం విజయదుందుభి మోగించింది. ఇక అందరికీ పదవులు వస్తాయని తిరుపతి జిల్లాలో ఆశించారు. కూటమి ప్రభుత్వం భాగస్వామ్యంతో ఉన్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డికి టిటిడి బోర్డులో చోటు దక్కింది. నారా లోకేష్‌కు 'ప్రజాగళంలో' దగ్గరుండి అన్నీ చూస్తున్న రవినాయుడుకు శాప్ ఛైర్మన్‌గా అవకాశం వచ్చింది. అటు చిత్తూరు, ఇటు తిరుపతి జిల్లాల్లో అత్యధిక స్థానాలు ఎంఎల్‌ఎలను గెలిచినా ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఎన్.అమరనాథరెడ్డికి మంత్రి పదవి వస్తుందని అందరూ అనుకున్నారు. అయితే చివరి నిమిషంలో మొండిచేయి చూపించారు. ఆ అసంతృప్తి ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో కొనసాగుతూనే ఉంది. కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, బోయకొండ, చంద్రగిరి మూలస్థానమ్మ, వేశాలమ్మ ఆలయాలకు, తిరుపతి, పాకాల, చిత్తూరు, బంగారుపాళ్యం, దామలచెరువు, గూడూరు, చంద్రగిరి మార్కెట్‌యార్డులకూ పదవులు ప్రకటించలేదు. అలాగే తుడా ఛైర్మన్ ఎవరన్నది తేలలేదు. తిరుపతి నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వూకా విజయ్‌కుమార్‌తో పాటు కోడూరు బాలసుబ్రమణ్యం, జెబి శ్రీనివాస్‌లు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఎంఎల్‌ఎ పదవికి పోటీ పడ్డారు.అయితే చివరి నిమిషంలో చిత్తూరు నుంచి వలసొచ్చి ఆరణి శ్రీనివాసులు దక్కించుకున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు పదవులను ఆశిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడు నెలలైనా పదవుల పందేరం జరగకపోవడంతో టిడిపి, జనసేన నేతల్లో నిరుత్సాహం మొదలయ్యింది. టిడిపి సభ్యత్వం పైపైకి నవ్వుతూ చేస్తున్నా, లోలోన వారిలో నిరుత్సాహం నెలకొంది. జనవరి 1 నూతన సంవత్సరానికైనా పదవులు ప్రకటిస్తారా; లేదా అన్నది వేచి చూడాల్సిందే.



వర్షం వచ్చే.. డ్రైనేజి పొంగే..కంపు కొట్టే..!

శిథిలావస్థలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ

ఆధునిక టెక్నాలజీకి రూ.300 కోట్లు ప్రతిపాదన



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ప్రజలు : మా వీధిలో రెండు రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది సార్... ఇంట్లో ఉన్నా కంపు కొడుతోంది.. వీధిలో తిరగలేకుండా ఉన్నాం..

శానిటేషన్ : ఆ.. సిబ్బందిని పంపిస్తాం..

(సిబ్బంది రావడం, మ్యాన్‌హోల్ ఎత్తడం, డ్రైనేజీ కలియతిప్పడం)

వారానికే మళ్లీ ఫోన్.. సిబ్బంది రావడం.. వెళ్లడం.. ప్రతివారం శానిటేషన్ సిబ్బందితో కార్పొరేషన్ కమిషనర్ సమీక్షలు చేయడం.. తెల్లవారి ఆకస్మిక తనిఖీలు.. షరామామూలే.. నగర ప్రజలకు తగినట్లుగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో వారి పాట్లు వర్ణనాతీతం. ఉత్తి చేతులతోనే జోరువానలోనూ డ్రైనేజీ పనులను ప్రాణాలను పణంగా పెట్టి చేస్తూ ఉంటారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్‌సిటీ పేరుకే.. ఈ వీధి చూసినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కంపు కొడుతుంది.. మధురానగర్, లీలామహల్ రహదారి, ఎవిఎస్‌ఆర్ కాలనీ, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాలైతే డ్రైనేజీ మురుగు చెరువులను తలపిస్తుంది.. ఎపుడో 1996లో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది.. ఎలుకలు విజృంభించి పైపులు కొట్టేసి, చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ వ్యవస్థ పొంగిపొర్లే పరిస్థితి. శాశ్వతంగా ఆధునిక టెక్నాలజీతో నిర్మించాలంటే రూ.300 కోట్లు కావాలి. పాత వ్యవస్థ పనికిరాదన్న విషయం కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలోని అందరికీ తెలుసు.. ఆధునిక టెక్నాలజీతో కొత్తది నిర్మించాలంటే కార్పొరేషన్ వద్ద డబ్బుల్లేవని ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారు.. కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా పట్టించుకుని శ్రీవారి పాదాల చెంత ఉన్న తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఆధునిక టెక్నాలజీతో యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సిన అవసరం ఉంది.

గత నెలలో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో తిరుపతిలో కొత్తగా యుడిఎస్ వ్యవస్థ నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కోరారు. రూ.300 కోట్లు అవుతుందని ప్రతిపాదనలను నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం తయారు చేసింది. అయితే ఇంతపెద్ద మొత్తంలో కార్పొరేషన్ వద్ద నిధులు లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, టిటిడి సహకరిస్తే తప్ప యుడిఎస్‌ను ఆధునిక టెక్నాలజీతో నిర్మించలేమని ఉన్నతాధికారులు చేతులెత్తేశారు. 1996లో రూ.18 కోట్ల రూపాయలతో తిరుపతి నుంచి రేణిగుంట తూకివాకం వరకూ 14 కిలోమీటర్ల వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. అప్పట్లో ఆర్‌ఆర్‌సి పైపులతో 25ఏళ్ల కాలపరిమితితో నిర్మించారు. ప్రస్తుతం కాలపరిమితి ముగిసింది. నూతనంగా డిఐ (ఇనుము) పైపులు పెట్టి 50 ఏళ్ల కాలపరిమితితో నిర్మించాలని భావిస్తున్నారు. గతంలో తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ కొత్త కనెక్షన్ నిర్మించాలని ప్రతిపాదన తయారు చేస్తే, ఆ పథకంలో దీన్ని తిరస్కరించారు. స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది.

తాత్కాలిక మరమ్మతులతో తడిచిమోపెడు

యుడిఎస్ పైపుల కాలపరిమితి ముగిసింది. నూతనంగా నిర్మించాల్సి ఉంది. అయితే నిధులు లేని కారణంగా పాత పైపులనే తాత్కాలిక మరమ్మతులు చేస్తూ గత ఐదేళ్ల కాలంలో ఆరు కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. తిరుపతి – రేణిగుంట మార్గంలో ఈ పైపులైను మార్చడానికి దాదాపు 100 కోట్లు అవుతుందని అంచనా. పైప్‌లైన్ మరమ్మతులు చేసిన ప్రైవేట్ టెలిఫోన్ ఆపరేటర్ కంపెనీలు తరచూ కేబుల్ వేయడానికి రోడ్లు తవ్వుతూ ఉండటం కూడా యుడిఎస్ దెబ్బతినడానికి కారణమని చెప్పవచ్చు. ఎపుడో 1996లో రేణిగుంట మండలం తూకివాకం గ్రామంలో ఫిల్టర్ ట్యాంకు నిర్మించారు. నగరంలో 4 లక్షల జనాభా కలిగి ఉన్నారు. 50 డివిజన్లకు గాను 60వేల యుడిఎస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో నుంచి వచ్చే మురుగును నేరుగా రేణిగుంట మీదుగా తూకివాకం గ్రామం ఫిల్టర్ ట్యాంకులో ఫిల్టర్ చేసి, మురుగునీటిని కొన్ని ప్రైవేట్ ఫ్యాక్టరీలకు లీటర్‌కు కొంత అమౌంట్ తీసుకుని, రైతులకు ఉచితంగానూ కార్పొరేషన్ అందిస్తోంది. మురుగునీటి ద్వారానే నగర పాలక సంస్థకు ఏడాదికి 10–20 లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. గతంలో వర్షాకాలం రాకముందే నగరంలో మురుగుకాల్వల పూడికితీత పనులు చేసేవారు. అయితే ఈ ఏడాది మురుగునీటి కాల్వ పూడికతీత పనుల టెండర్లు ఆలస్యంగా పిలవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

30కోట్లతో ప్రతిపాదన : శ్యాంసుందర్, ఎస్ఇ, మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి

తిరుపతి –రేణిగుంట రోడ్డు వద్ద ఉన్న యుడిఎస్ పైపులైన్ మార్చడానికి రూ 30కోట్లు వెచ్చించి పాత పైపులైన్ మార్చి కొత్త పైపులైన్ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో పనులు చేయడానికి చర్యలు తీసుకుంటాం.